# భూ బంతి

కె.వి.యస్. వర్మ

"నీకూడా తమ్ముడొస్తున్నాడుకదా, నీకేం భయం లేదు. ధైర్యంగా వెళ్లు తల్లీ"

అవును తల్లీ అవును. నీలాగే తల్లులందరూ పిరికి మందు నూరిపోయడం వల్లే ఈ ఆడజాతి బతుకు ఇంత అధ్వాన్నంగా తయారయింది. నీ అల్లుడు నీ కూతుర్ని తన్ని తగిలేస్తే, వాడికి బుద్ధి చెప్పడంపోయి, ఏ తప్పూ చేయని నీ కూతురికి బుద్ధులు చెబుతావా!ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన సోమరులారా చావండి అని మహాకవి మీలాంటి వాళ్లని చూసే అనుంటాడు.

"పెట్టుబడిదారుల్లాగే మీ స్త్రీజనోద్ధారకులూ విప్లవ పదజాలం బాగానే వాడుతున్నారే" అంటాడు పృథ్వీ.


నేనేం మాట్లాడినా దాన్ని వ్యతిరేకించడం తన ధ్యేయంగా పెట్టుకున్నాడని నా నమ్మకం. నా ఆలోచనలకు అడ్డుతగిలిన పృథ్వీ మీద చాలాసార్లలాగే ఇప్పుడూ కోపమొచ్చింది.

ఆ అమ్మాయి పక్కింటతనితో మాట్లాడిందని ఆ మహానుభావుడికి ఆమెమీద అనుమానం వచ్చిందట. ఆ అమ్మాయిగారి మొగుడుగారేమో ఇంటి విషయాలు సరిగా పట్టించుకోడట. పక్కింటితను కాస్తో కూస్తో సహాయపడే గుణం వుండడంతో వాళ్ల కరెంటు బిల్లు కట్టేడట. అతను చేసిన ఆ సాయం చూసి ఆ మగ మహారాజుగారు తన భార్య శీలాన్నే శంకించాడంట. "నీలాంటి ముండతో నేను సంసారం చెయ్యను. పోవేపో మీ ఇంటికి" అన్నాడట. ఆవిడ లబోదిబోమంటూ పుట్టింటికి పారొచ్చేసిందట...

"ఎంతకు బరితెగించేవే తల్లీ" అంటూ ఆ అమ్మాయి తల్లిదండ్రులు ముందు కోప్పడిపోయి, తర్వాత తమాయించుకొని, మధ్యవర్తిని పంపి, స్కూటర్ కొనిచ్చి, 'మా అమ్మాయి, నీ పెళ్లాం నిప్పు" అని చెప్పించేక, ఇప్పుడు ఆమెను పంపుతున్నారట.

"నేను వెళ్లేక కూడా ఆయన మళ్లీ అనుమానంతో చూస్తారేమో" అని ఆ వెర్రమ్మాయి అనుమానంగా అంటే, 'మేం అంతా సరిచేశాంగా. పైగా నీ తమ్ముడంటే అల్లుడిగారికి చాలా ఇష్టం. వాడితో జోకులేస్తూ పడిపడి నవ్వేవారుగా"అంటూ 'ఎర' వేసి పంపుతున్నారు.

ఈ ముసలి నక్కలు ఇలాంటి జిత్తులేసి, నీతి శతకాలు వల్లించడంవల్లే స్త్రీజాతిలో స్థైర్యం కలగడం లేదు.



బస్సు స్టార్ట్ అయ్యింది. ఆ ముసలి నక్కలైన తల్లిదండ్రులిద్దరూ మళ్లీ ఏదో గుసగుసగా చెప్పి, చేతులూపుతూ నిలబడ్డారు. వాళ్లను దాటి బస్సు ముందుకెళ్లిపోయింది. ఆ అమ్మాయికూడా బెరుకు బెరుకుగా చెయ్యెత్తి ఊపింది.

నాకు ఒళ్లు మండిపోతోంది. ఏదేదో అనబోయి, బస్సులో పెద్ద డ్రామా అయిపోతుందేమోనని నిగ్రహించుకున్నాను. మగాడి తప్పున్నా ఆడదాని కాపురం నిలబెట్టాలని ప్రయత్నించినంత కాలం స్త్రీ జాతి బతుకింతే. పరాయి మగాడితో నాలుగు మాటలు, అదీ కుటుంబ అవసరాల కోసం మాట్లాడినా దుర్మార్గంగా ఆలోచించే ఈ పురుష పుంగవుల్ని తప్పుపట్టనంత కాలం ఈ కథలింతే.

"ఎవరు తప్పు చేసినా ఆ కాపురాన్ని నిలబెట్టాలని ఎవరైనా ప్రయత్నిస్తే తప్పెలా అవుతుంది" అంటాడు పృథ్వీ.

"మగాడు పక్కింటావిడతో మాట్లాడితే తప్పుపట్టరేం"

"ఆ పక్కింటావిడ మొగుడు తప్పుపట్టాడా? లేదు కదా. అంటే మగవాళ్లంతా ఒకలాగే వుండరని తెలుస్తోంది కదా"

"ఏమో ఆ మగమహారాజూ తప్పు పట్టి వుండొచ్చుకదా"

"నిజమే. తప్పుపట్టి వుండొచ్చు, నువ్వనుకున్నట్టుగా. అలాగే అతను పట్టించుకోకపోవచ్చు కూడా కదా"

"నువ్వు కూడా పురుష పుంగవుడివే కాబట్టి అలా ఆలోచిస్తున్నావ్"

"అలాగయితే, నువ్వు పవిత్ర పడతివి కాబట్టి కూడా అలాగలాగ ఆలోచిస్తున్నావని ఎందుకనుకోకూడదు"

"పవిత్రత గివిత్రత అని మాట్లాడకు. ఏంటీ, గాడిద గుడ్డు పవిత్రత! శ్రీకృష్ణుడు పదహారువేలమందితో పడుకుని, తన రుక్మిణి, తన సత్యభామ వగైరాలు పవిత్రంగా ఉండాలనుకోవడమా? అర్జునుడు ద్రౌపతి,సుభద్ర వగైరాలతో పడుకుంటూ వాళ్లు పవిత్రంగా ఉండాలని కోరుకోవడమా, పవిత్రత!"

"పవిత్రతను అపవిత్రం చెయ్యాలంటావా ఏం"

"తప్పకుండా అంటాను. ఈ మగాళ్లు ఇంతకాలంగా అంతమందితో పడుకుంటున్నప్పుడు ఆడాళ్లు మాత్రం పదిమందితో పడుకుంటే తప్పేంటి"

"అలా పడుకోడం, లేదా అలాగనడం గొప్పనుకుంటాను"

"గొప్పలకు పోడం మీ జాతికి అలవాటు. ఆ మహారాజు తొంభై తొమ్మిది మందితోనూ, ఈ నిజాం రాజు మూడొందల మందితోనూ పడుకున్నారని చాలా గొప్పగా రాశారు కదా"

"అలా సాగినోళ్లు అలా చేసి వుండొచ్చు. అయితే, చాలామంది సామాన్యులు తమతమ పెళ్లాలతో సంసారాలు చేస్తున్నావాళ్లే కదా"

"వాళ్లల్లోకూడా చిలక్కొట్టుడుగాళ్లు తక్కువేం కాదు"

"అంచేత, ఆడాళ్లు కూడా అలా వుండాలంటావ్"

"ఉండి తీరాలంటాను. అప్పుడుగానీ ఈ మగాళ్లకు బుద్ధిరాదు"

"మగాళ్లకు బుద్ధిరావాలంటే వాళ్ల తప్పులే మహిళలూ చేయాలన్నమాట. బావుంది. యూరప్‌లో ఓ మిస్ట్రెస్, పేరు గుర్తుక రావడం లేదు, ఒకరోజున ఇరవై మందితో పడుకున్న ఓ వేశ్యతో పోటీపడింది. ఆమెను మించి రికార్డు సాధించాలనుకుంది. ఇరవైనాలుగ్గంటల్లో ఇరవై ముగ్గురితో పడుకుంది..."

"నిజమేనా పృథ్వీ"

"అక్షరాలా నిజం. ఎందుకంటే ఆవిడ గురించి ఇర్వింగ్ వాలెస్ పరిశోధించి మరీ రాశాడు. కొంపతీసి నువ్వుగానీ ఆ మిస్ట్రెస్ రికార్డును చెరిపేయాలనుకుంటున్నావేంటీ సుమిత్రా"

"నీకెందుకో అంత ఆసక్తి"

"వాళ్లల్లో నేను మొదటివాడినో, మధ్యవాడినో, చివరివాడినో తెలుసుకుందామని..."

> *"పవిత్రత గివిత్రత అని మాట్లాడకు. ఏంటీ, గాడిద గుడ్డు పవిత్రత! శ్రీకృష్ణుడు పదహారువేలమందితో పడుకుని, తన రుక్మిణి, తన సత్యభామ వగైరాలు పవిత్రంగా ఉండాలనుకోవడమా?..."*

పృథ్వీ వంక చురుగ్గా చూశాను. అతని కళ్లల్లోని కొంటెతనం గమనించాను.


"యూజ్‌లెస్ ఫెలో, నీది నాలుకా తాటిపట్టా"

"అప్పుడే అలాంటి నిర్ణయానికి రావడం అన్యాయం కదా" విచారంగా మొహంపెట్టి అన్నాడు.

"షటప్" అని అక్కడినుంచి వచ్చేశాను.

చాలాసార్లు అతనితో వాదించడం నాకు కష్టమవుతుంది. ప్రతిదానికీ అడ్డం వస్తాడు. నేనేదన్నా కొత్త విషయం చెబితే, అలాంటిదేదో పురాణాల్లోనో చారిత్రకంగానో వుందంటూ ఉదాహరణలిస్తుంటాడు. అందుకే, ఒకోసారి నాకు ఒళ్లు మండినప్పుడు 'ఒరి వేదవ్యాసా' అంటాను. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయిష' అని వెక్కిరిస్తాను.

"వంద పూలు వికసించనీ వేయి ఆలోచనలు సంఘర్షించనీ అని మావో ఎంత గొప్పగా అన్నాడు" అంటాడు పృథ్వీ...



బస్సాగింది.

"అప్పుడే దొండవాక వచ్చేసిందా" అనుకున్నాను. బేగ్ పట్టుకుని దిగి, నాలుగడుగు లేసేటప్పటికి మా రాధిక తమ్ముడు కనిపించాడు. అతని మోటార్ బైక్ మీద వాళ్లింటికెళ్లాను.

నన్ను చూసి రాధిక ఆనందం అంతా ఇంతా కాదు.

"హైదరాబాద్ నుంచి ఇంత దూరం వస్తావనుకోలేదే సుమిత్రా" అంటూ నన్ను కౌగిలించేసుకుంది.

"బాగా, ఇంకా గట్టిగా చాలాసేపు కౌగలించుకోవే సఖీ. రేపు పెళ్లయ్యేక మమ్మల్ని ఎలానూ కౌగలించుకోవు" అన్నాను నవ్వుతూ.

రాధిక బోలెడు సిగ్గుపడిపోతూ నన్ను వదిలేసింది.

నేను 'ఇంకా గట్టిగా కౌగలించుకో' అని మగాడిగా అన్నట్టున్నాను కదూ. ఆమె ఆడదానిలానే సిగ్గుపడిపోయింది. ప్రతి మగాడిలోనూ ఎంతో కొంత ఆడలక్షణమూ ప్రతి ఆడదానిలోనూ ఏదో మేర మగ లక్షణమూ ఉంటాయనే మాట నిజమే సుమా!

"ఏంటే నన్ను వదలవు" అని రాధిక అనేటప్పటికి ఈ లోకంలోకి వచ్చాను.

"ఏవే, రాధీ. నీ కాబోయే మొగుడుంగారు ఎలా వుంటాడే"

"నాకు బాగానే వుంటాడు"

"మిగతావాళ్లకు బాగోడా"

"బాగోకూడదనే నేను అనుకుంటున్నాను"

"ఇతరులకు కూడా బావుంటే ఎగరేసుకుపోతారనా"

**తనెప్పుడూ మా చర్చల్లో హుషారుగా పాల్గొలేదు. నాతో ఎప్పుడూ వాదించలేదు. నా అభిప్రాయాలను ఎప్పుడూ వ్యతిరేకించలేదు, అలాగని సమర్థిస్తూనూ మాట్లాడ లేదు. బహుశా అందుకే తను ఆమెను నా మనిషిగా అపోహపడ్డానేమో! నన్ను వ్యతిరేకించకపోవడంవల్ల కూడా ఆమె గురించి పెద్దగా ఆలోచించలేదనుకుంటాను**

"ఏమో, నాకు తెలీదు"

"ఏమీ తెలీకుండా అలా ఎందుకనుకున్నావ్"

"ఏంటే, కోర్టులో ఎగస్పార్టీ లాయర్ లాగ"

"ఇదేంటే తల్లీ, అప్పుడే కోర్టుదాకా పోయావు. ఎవరన్నా ఎగరేసుకుపోతే నీ మొగుడ్ని, సారీ, మీ ఆయన్ని, కోర్టుకెళ్తావే ఏంటీ"

"ఒసే, సుమిత్రా. మరీ అంత అన్యాయంగా మాట్లాడావేంటే! మన కాలేజీలో నీ గురించి ఏమనుకునే వాళ్లమో తెలుసా. సుమిత్ర పేరుకు తగ్గదే. మంచి మిత్రురాలు అనుకునేవాళ్లం..."

"అయితే. ఇప్పుడు కాదా"

"కాదని నేనన్నానా? పాత సంగతి గుర్తుచేశానంతే"

"సరే సరే. అతను నీకెప్పటినుంచి తెలుసు?"

"ఖచ్చితంగా చెప్పలేను. నాలుగేళ్ల క్రితం డిగ్రీ ఫైనలియర్‌లో కాస్త తెలుసు. అప్పుడుకూడా మేం మాట్లాడుకున్నది చాలా తక్కువ. తర్వాత, మేం హైదరాబాద్ వచ్చేశాం. ఎమ్మే నీతోపాటు అక్కడే చేశానుకదా. మా పెళ్లిచూపులప్పుడు మేం ఒకర్ని ఒకరం చూసుకుని బోలెడు ఆశ్చర్యపోయాం..."

"అంటే అతని గురించి నీకూ, నీ గురించి అతనికీ పెద్దగా తెలియదన్నమాట"

"చాలామందితో పోలిస్తే నువ్వన్నంత పెద్దగా కాకపోయినా కొద్దిగా తెలుసుకదా"

"గుడ్డిలో మెల్లంటావ్"

"అబ్బ... నీతో పెద్ద గొడవే బాబూ"

"అంత గొడవ నాతో నీకెందుకే బాబూ. మీ మేరీడ్ లైఫ్ గురించి అయినా ఏమన్నా మాట్లాడుకున్నారా"

"మేరీడ్ లైఫ్ గురించి మాకు ఏం తెలుసని మాట్లాడుకుంటామే!..."

"ఎవరి గురించీ ఏమీ తెలుసుకోకుండానే మీరిద్దరూ ఒకటవుతున్నారా"

"అలా ఎందుకనుకోవాలి? అతను చదువుకున్నవాడు. ఉద్యోగం చేస్తున్నాడు. నన్ను పెళ్లి చేసుకోడానికి ఇష్టపడ్డాడు. అంతకంటే ఇంకేం కావాలి?"

"నీ వ్యక్తిత్వం అతనికీ, అతని వ్యక్తిత్వం నీకూ తెలియక్కర్లేదా"

"వ్యక్తిత్వం గట్రా పెద్ద మాటలు నాకు తెలీదు లేవే. ఇంక మా గురించి వదిలేయవే తల్లీ, నీకో నమస్కారం" అంది రాధిక చేతులు జోడిస్తూ.

మౌనమే నీ భాష ఓ మూగ మనసా అనుకుంటూ నేను మారు మాట్లాడలేక పోయాను.

మా రాధిక, మాతోపాటు రెండేళ్లు మసలిన రాధిక మాలా లేదేంటీ? ఉస్మానియా యూనివర్సిటీలో మేం గడిపిన రోజులు గుర్తు చేసుకున్నాను. తనెప్పుడూ మా చర్చల్లో హుషారుగా పాల్గొలేదు. నాతో ఎప్పుడూ వాదించలేదు. నా అభిప్రాయాలను ఎప్పుడూ వ్యతిరేకించలేదు. అలాగని సమర్థిస్తూనూ మాట్లాడలేదు. బహుశా అందుకే తను ఆమెను నా మనిషిగా అపోహపడ్డానేమో! నన్ను వ్యతిరేకించకపోవడంవల్ల కూడా ఆమె గురించి పెద్దగా ఆలోచించలేదనుకుంటాను. ఒకరి గురించి ఒకరు పూర్తిగా అర్థం చేసుకోకుండా పెళ్లి చేసుకునేవాళ్లు సవ్యంగా సంసారం చేయగలరా? అభిమానాలూ, స్వాభిమానాలూ ప్రేమలూ ద్వేషాలూ ఇష్టాలూ అయిష్టాలూ రుచులూ అభిరుచులూ అభిప్రాయాలూ గట్రా ఎవరివేంటో తెలుసుకోనక్కరలేదా?

ఎదకొచ్చిన పశువుల్ని ఎదురెదురుగా వదిలేసినట్లు, పెళ్లిచేసి కార్యం గదిలోకి పంపెయ్యడమేనా?

ఇలాంటి అస్తవ్యస్త వివాహ వ్యవస్థ మారాలి. అలా కోరుకున్నంతలో అది మారుతుందా? మనమే మార్చాలి. అంటే మనం మారాలి...

"హలో హలో సుమిత్రా, ఏంటే అలా మౌనంగా ఉండిపోయావ్" అంటూ రాధిక నా చెయ్యి పట్టుకుని తన గదిలోకి తీసుకుపోయింది.

తన పెళ్లికోసం కొన్న చీరలూ నగలూ ఒకోటీ తీసి నాకు చూపించింది. వాటికి ఎన్ని వేలయిందో ఒకో దాని ఖరీదూ వివరిస్తూ చెప్పింది.

ఇన్నేసి వేలుపెట్టి ఇన్నేసి బట్టలూ నగలూ ఒకేసారి కొని పడేయడం ఎందుకో? తమకు పెళ్లవుతుందంటే తన కోరికలు తీర్చే మొగుడితోపాటు బోలెడు కొత్త చీరలూ నగలూ కూడా వస్తాయని ఆశపడేవాళ్లు ఎక్కువమందే ఉంటారు. ఇక పెళ్లి ఖర్చులు కట్నాలతో కలిపితే లక్షల్లోనే వుంటుంది. ఎంత డబ్బు వృథా అయిపోతోంది! ఆడా మగా ఒకరికొకరు నచ్చితే, కలిసి వుండే రోజులు రావాలి. ఇప్పటికే కొందరలా వుంటున్నారు. అలాంటివాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఇదొక ఉద్యమం కావాలి.

"మీ ఉద్యమం తప్ప ఇంకే ఉద్యమాలూ మీకు పట్టవు. దోపిడికి వ్యతిరేకంగా ప్రాణాలర్పిస్తూ పేదల పక్షాన వుండి చేస్తున్న విప్లవోద్యమాల పట్ల మీరు మౌనగీతాలాలపిస్తారు. నిజానికి ఆ ఉద్యమాలతో పోలిస్తే మీది ఉద్యమమేకాదనిపిస్తుంది. పైగా మీ నలుగురిలోనూ ఒకరిని మించి ఒకరు స్వప్రయోజనా ప్రచారోద్యమాలు చేసుకోడంలోనే ఎక్కువగా నిమగ్నమై ఉంటారు" అంటాడు పృథ్వీ.

"మీ విప్లవోద్యమాలు స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం కోసం అసలు పట్టించుకోలేదు కాబట్టే, మేం ఉద్యమించాల్సి వచ్చింది..."

"అసలు పట్టించుకోలేదనడం అన్యాయం"

"మా గురించి మేమే ఉద్యమిస్తాం. మీ మగాళ్ల నాయకత్వం మాకవసరం లేదు. మాకు న్యాయమూ చేయదు"

"మొదలుపెట్టారుగా, తుదముట్టించండి. మీ మిడి మిడి జ్ఞానంతో మానవ సంబంధాలకంటే విశృంఖలత్వానికే పెద్ద పీట వేయండి"

"మానవ సంబంధాల్లో స్త్రీ పురుష సంబంధాలూ ఓ భాగమే. విశృంఖలత్వం అనే మాటను వెనక్కు తీసుకో"

"అంటే, మీ ఉద్యమం ఓ భాగం మాత్రమే అని నువ్వు ఒప్పుకున్నట్టేగా. వివాహేతర అక్రమ సంబంధాల్ని గొప్పగా ప్రచారం చెయ్యడం మీరు మానుకుంటే నా మాటను వెనక్కు తీసుకుంటాను" అంటూ సాగదీస్తాడతను.

"బట్టలు బావున్నాయా" అంది రాధిక నా భుజం పట్టుకుని కుదుపుతూ.

"చాలా బావున్నాయి" అన్నాను.

"నడు, భోంచేద్దాం" అంది.

భోంచేశాక కాసేపు నడుం వాల్చాను.

"ఇక లే సుమిత్రా. ముఖం కడుక్కుని రా. అప్పుడే నాలుగయ్యింది. టీ తాగి అలా మా పొలంలోకెళ్లొద్దాం" అంది రాధిక.

టీ తాగి బయటికొచ్చాం. సన్నటి తార్రోడ్డు మీంచి కొంత దూరం నడిచి, ఎడమవైపున్న మట్టిరోడ్డు మీదకెళ్లాం. ఓవైపు మామిడిచెట్లు. మరోవైపు చెరుకు తోట. కాస్త దూరం నడిచాక కొబ్బరి చెట్లు. వాటిమధ్య అరటి చెట్లూ, మిరప తోటా.

"కొబ్బరి బొండాలు తియ్యమంటారేటమ్మా" అన్నాడు పాలేరు సూరన్న.

"తియ్యి" అన్నట్టుగా తలూపింది రాధిక.

"మిరపకాయలు కోయడం ఇంకా అవలేదా వెంకూ"

"సీకటయ్యేటప్పటికి కోత అయిపోతాదమ్మా" అంది వెంకమ్మ.

"ఇది ఆ సూరన్న పెళ్లాం" అని రాధిక నాకు చెప్పింది.

కాస్త నలుపయినా వెంకమ్మ

ఆకర్షణీయంగా వుంది. ముప్పై అయిదు లోపుండొచ్చు ఆమెవయసు.

"అమ్మా, ఏవన్నా పెట్టు"అంటూ తొమ్మిదేళ్ల కుర్రాడు వెంకమ్మ కొంగు పట్టుకు లాగాడు.

"మిరపకాయలెట్టనా"

"అమ్మో, మంట"

"అయితే, కాసేపాగు. అయ్య కొబ్బరి సెట్టెక్కాడు. ఈ అమ్మలిద్దరూ కొబ్బరి బొండాలు తాగేక, గుంజు తీసిత్తాను, తిందువుగాని" అంటూ వెంకమ్మ నవ్వి, తన పనిలో పడింది.

కొబ్బరి బొండాలు తాగి, పొలం గట్టుమీద కూర్చున్నాం కబుర్లు చెప్పుకుంటూ.

ఎదురుగా కొండ.పచ్చని చీర కట్టుకుని వెల్లకితలా పడుకున్న యువతిలా ఉంది. మేఘాలు షికార్లు చేస్తున్నాయక్కడ చొంగలు కార్చుకుంటూ తిరిగే మగాళ్లలా. గట్టు పక్కనే బోరు వుంది. నీళ్లు బోదెలోంచి తోటలోకెళ్తున్నాయి.

సూరన్న బనీనూ నిక్కరూ విప్పేసి,గోచీతో బోరు నీళ్లకింద కూర్చుని స్నానంచేస్తున్నాడు.

ఈ పచ్చని పొలాల మధ్య ఆ బోరుకింద నేనూ అలా స్నానం చెయ్యగలిగితే... రాధికతో అదే మాటన్నాను. మరీ వాడిలా అన్నీ విప్పేసి చెయ్యలేం కానీ, రేపు నైటీలు తెచ్చుకుని ఇక్కడే స్నానంచేద్దాంలే" అంది రాధిక.

మర్నాడు సూరన్న కిరాణా సామాన్లూ గట్రా తేవడానికి తుని వెళ్లాడు. మేం నైటీలు వేసుకుని బోరు నీళ్లకింద కూర్చుని స్నానాలు చేశాం. చాలా హాయిగా, థ్రిల్లింగ్‌గా అనిపించింది.

బట్టలు మార్చుకుని ఇంటికి బయల్దేరాం. మిరపతోట పక్క డొంకల మధ్య రెండు నల్ల, గోధుమ త్రాచులు ఒకదానినొకటి పెనవేసుకుంటున్నట్టుగా ఆడా మగా. నేనాగిపోయాను నాకు తెలీకుండానే. ఇలాంటి పచ్చని ప్రకృతి మధ్య, ఈ ప్రపంచాన్ని డోంట్‌కేర్ అనేసి అలా స్వేచ్ఛగా... నా ఒళ్లు వేడెక్కిపోయింది. రాధిక కూడా నాలాగే ఆగిపోయినట్టుంది. కాసేపటికి వాళ్లు లేచారు.

వెంకమ్మ! అతను సూరన్నకాడు!!

వాళ్లు బిత్తరపోయారో లేదో కానీ, మేం మాత్రం తత్తరపడి, గబగబా ఇంటికెళ్లిపోయాం.

ఆ దృశ్యం నాకళ్లముందు కదులుతూనే వుంది. చలం నవలల్లోని కొన్ని పాత్రలూ సన్నివేశాలూ, వర్ణనలూ జ్ఞాపకమొచ్చాయి.

భోంచేసేటప్పుడు కూడా నాలాగే రాధికా మౌనంగానే వుంది. నాలాగే ఆమె కూడా ఆ దృశ్యం గురించే ఆలోచిస్తోందేమో. పడుకునే ముందు ఇక ఉండబట్టలేక అడిగాను.

"రాధీ, వెంకమ్మ అలా ఇంకోడితో..."

"నువ్వింకా దానిగురించే ఆలోచిస్తున్నావా. వాళ్లల్లో ఇలాంటివిక్కడ మామూలే"

"సూరన్నకు తెలిస్తే..."

"తెలిసినా ఏం కాదు. సూరన్న మరోదానితో సరదా పడినా వెంకమ్మా గోలపెట్టదు. ఎప్పుడన్నా అయితేనే సుమా. వెంకమ్మ సూరన్నను పక్కలోకి రానియ్యకుండా ఎవడితోనో రోజూ తిరుగుతుందనుకో, అప్పుడు వాళ్ల కులపెద్ద దగ్గర పంచాయితీ పెడతాడు. ఇకముందు అలా చెయ్యనంటే 'తప్పు' వేసి ఊరుకుంటారు.అలాగే సూరన్న చేసినా 'తప్పు' కట్టాలి. ఒకరిపై ఒకరికి ఇష్టం లేదంటే మాత్రం విడిపోయే అవకాశమూ వుంటుంది" అంటూ రాధిక ఆవలించింది.

మన వాళ్లల్లో అయితే ఇలాంటివి పెద్ద సమస్యలయిపోతాయి.

బృహస్పతి, తార, చంద్రుడూ మనలాటి వాళ్లే అయ్యుంటారేమో.ముసలి మొగుడితో విసుగొచ్చి, తార చంద్రుడితో సరదాపడి వుంటుంది. గురువుగారి భార్య అయినా, తార చంద్రుడికి యువతిగానే కనిపించి వుంటుంది. వాళ్లిద్దరూ సరదాపడితే, బృహస్పతి ఊరుకున్నాడా? లేదే! ఆగ్రహంతో ఊగిపోయాడు. అసూయతో మండిపోయాడు. అందుకే శపించాడు.

ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరవుతారనడం నిజమేలా వుంది. బహుశా అందుకేనేమో నేనూ పృథ్వీలాగ ఆలోచిస్తున్నాను.

పొద్దుట లేచేటప్పటికి ఇంట్లో అంతా సందడిగా వుంది. చుట్టపక్కాలతో ఇల్లు కళకళలాడుతోంది. టిఫిన్లూ కాఫీలూ భోజనాలూ నడుం వాల్చడాలూ, పేకాటలూ... అలా రాత్రయిపోయింది. పదిన్నరకు వేదమంత్రాలతో రాధిక పెళ్లయిపోయింది. ఇద్దరూ ఒకరి తలపై ఒకరు బియ్యం పోసుకున్నారు.బిందెలోంచి ఉంగరం తియ్యడానికి ఇద్దరూ పోటీపడ్డారు.ఉంగరం మా రాధికే తీసిందనుకున్నాం.కావాలనే అతను ఆమెకు అందేలా చేశాడని తర్వాత రాధిక కొంచెం గొప్పగా చెప్పింది.పెద్దగా పరిచయం లేని కొత్త దంపతులకు కాస్త చనువు కలగడానికే ఇలాంటివి పెట్టారని కొందరనడం విన్నాను.

> ఎదురుగా కొండ.పచ్చని చీర కట్టుకుని వెల్లకితలా పడుకున్న యువతిలా ఉంది. మేఘాలు షికార్లు చేస్తున్నాయక్కడ చొంగలు కార్చుకుంటూ తిరిగే మగాళ్లలా

ఆ రాత్రి పిచ్చాపాటీతో గడిచిపోయింది. తెల్లారేక నేను గబగబా తయారయిపోయాను. రాధికతో పెద్దగా మాట్లాడ్డానికి వీలు కలగలేదు. అంతా హడావిడి. పదకొండు గంటలకే భోజనాలు చేసి చాలామంది చుట్టాలు వెళ్లిపోయారు.ఒంటి గంటకు భోంచేశాక, బేగ్‌లో బట్టలు సర్దుకున్నాను.

"ఇక వెళ్లొస్తానే"

"ఇవేళుండి వెళ్లవే సుమిత్రా"

"అవునండీ. ఇవేళుండండి. ఈ రాత్రే కదా రాధిక శోభనం. అటకమీంచీ, తలుపులసందుల్లోంచీ చూస్తూ వాళ్లను ఆటపట్టిద్దాం. అలాగే రేపు వాళ్లిద్దరూ ఆడే పూలబంతాట కూడా చూద్దురుగాని" అంది రాధిక బంధువురాలమ్మాయి మధ్యలో కలగజేసుకుంటూ.

"ఇప్పటికే చాలా రోజులున్నాను. ఇక వెళ్లాలండి" అని ఆమెతో అన్నాను.

నేను ఉద్యోగాల వేటలోఉన్నానని తనకు తెలియటంవల్లేమో రాధిక నన్ను బలవంతం చెయ్యలేకపోయింది.

"మా తమ్ముడు ఏదో పనిమీద ఇందాకే తుని వెళ్లేడు. ఎప్పుడొస్తాడో తెలీదు. నువ్వింకా ఉంటావనుకున్నాను. లేపోతే వాడి మోటార్ బైక్‌మీద దేబెట్టేవాడు"

"ఫర్లేదులేవే. బస్సులున్నాయి కదా"

"నేనిప్పుడు రోడ్డు మీదకు రావడం బాగోదు" అంటూ, "ఏవే, సుమిత్రను బస్సెక్కించి వస్తావా"అంది రాధిక వాళ్ల చుట్టాలమ్మాయిని.

"అలాగే"అంటూ ఆమె నావెంట వచ్చింది.

పొలాల మధ్యనుంచి నడుస్తూ వస్తున్నాం. రాధిక చుట్టాలమ్మాయి నేటి శోభనం రాత్రి తాము చెయ్యబోయే అల్లరి గురించి చెబుతోంది.

రాధిక శోభనం గురించి వీళ్లకెందుకింత ఆసక్తి? పెళ్లయ్యాక అందరికీ జరిగేదే కదా. పైగా వాళ్లను ఆనందించనీయకుండా వీళ్లు అల్లరి పెట్టడం ఎందుకో?

ఆలోచిస్తూ నడుస్తూ ఉలిక్కిపడి ఆగిపోయాను.

పక్కనే తాటాకు ఇల్లు ముందు సూరన్న, వెంకమ్మ... చిన్న స్టూలు మీద సూరన్న కూర్చుని వున్నాడు. వెంకమ్మ అతనికి తలంటిపోస్తోంది. అతనేమన్నాడో, ఆమె పకాపకా నవ్వుతూ నన్ను చూసింది. గబుక్కున రెండు చెంబుల నీళ్లు అతని తలమీద పోసి,

"పట్నం అమ్మాయిగోరు ఎలిపోతున్నట్టున్నారు. ఇప్పుడే వస్తానుండయ్యా" అని పమిట కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ గబగబా నాదగ్గరికొచ్చింది వెంకమ్మ.

"ఏంటమ్మగోరూ, ఎలిపోతున్నారా? ఇయేళ్టికుండలేకపోయారా"

"పనుంది వెంకమ్మా. వెళ్లక తప్పదు"

"మంచిదమ్మా. రాదికమ్మగోరు అత్తారింటికెళ్లిపోతారు.మళ్లీ మిమ్మల్ని సూస్తానో నేదో"

వెంకమ్మ కళ్లల్లో తడి చూసి, ఆమె అభిమానానికి కదిలిపోయాను. ఆమె చెయ్యి పట్టుకుని, నొక్కి, 'వెళ్లొస్తా' అంటూ ముందుకు నడిచాను.

బస్సెక్కి, రాధిక చుట్టాలమ్మాయికి టాటా చెప్పాను.

నా కళ్లముందు రెండు దృశ్యాలు కదులుతున్నాయి. ఆ రోజు వెంకమ్మ మరొకడితో... ఈరోజు వెంకమ్మ సూరన్నకు తలంటు పోస్తూ... అదీ ఇదీ ఎలా? అది అదే. ఇది ఇదేనా? అది సరదానూ, ఇది సాహచర్యమూనా? అది కామమూ, ఇది ప్రేమానా? సరదాలో ప్రేమ ఉండొచ్చు. ఉండకపోవచ్చు. ప్రేమలో సరదా ఉండొచ్చు. ఉండకపోవచ్చు.

వాళ్లంత స్వేచ్ఛగా... అభిమానంగా... మామూలుగా...నువ్వూ నేనూ అందరమూ...

"నువ్వెంతో పెద్ద సంగతులనుకున్నవి ఎంతో చిన్నవిగా ఇప్పటికే వున్నాయని ఇవేళ్టికి తెలిసిందన్నమాట. పైగా ఎప్పటినుంచో కొనసాగుతున్నవి కొందరికి కొత్తగా కూడా కనిపిస్తాయి. భూమి గుండ్రముగా ఉండును. అనగా బంతిలాగుండును" అని పృథ్వీ తప్పక అంటాడు.

అస్తమానం పృథ్వీ నా ఆలోచనల్లోకి ఎందుకు వస్తున్నాడు? నేనెందుకు రానిస్తున్నాను? తనే నేను, నేనే తను, తనూ నేనూ, నేనూ తనూ త్వమేవాహమూ!

పృథ్వీ అంటే స్త్రీ... భూమి. బంతిలాగుండే భూమి! ●

## స్వగతం

# ఫలించిన కలలు!



సునీత

మా అమ్మానాన్నలకి మేం ఇద్దరం ఆడపిల్లలం. మా నాన్న మగపిల్లలు లేనందుకు బాధపడేవారు. మా అమ్మ మాత్రం తన ఆశలూ, ఆశయాలూ అన్నీ మా మీదే పెట్టుకొని పెంచింది. చిన్నతనంలో తను చదువుకొని ఉద్యోగం చేయాలని తపించింది. కానీ అది నెరవేరలేదు. అందువల్ల మమ్మల్ని బాగా చదివించి ఉద్యోగస్తుల్ని చేయాలన్నది అమ్మ ఆకాంక్ష. కానీ పరిస్థితులు కొంత అనుకూలించలేదు. దానిలో నాకు ఇంటర్‌లోనే పెళ్ళిచేశారు. చదువుని సగంలో ఆపేయడం నాకు ఇష్టం లేక కన్నీళ్ళు పెట్టుకున్నాను. నా బాధ చూసి మా అమ్మ మా అత్తవారిని ఒప్పించి నేను చదువు కొనసాగించేలా ఏర్పాటుచేసింది. నేను వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని టీచర్ ట్రైనింగ్ పూర్తిచేశాను. ఇందుకోసం మా ఇంట్లోవాళ్ళు పడిన శ్రమ చెప్పనలవి కానిది. ఇదంతా ఒక ఎత్తయితే నేను డియస్సీ పరీక్ష రాయడం మరో ఎత్తు. ఆ సమయంలో నా ఐదు నెలల బిడ్డడి బాధ్యతని మా అమ్మే భరించింది. పైగా, నాకు తీవ్రంగా జ్వరం వచ్చింది. ఎగ్జామ్ రాయలేనేమో అని తెగ బెంగపడ్డాను. ఈ టెన్షన్ వల్ల ఎగ్జామ్ హాల్లో కళ్ళు తిరిగి పడిపోయాను. అందరూ చాలా కంగారుపడ్డారు. నా పరీక్ష సమయంలో అర్ధగంట ఆ రకంగా వ్యర్థమైపోయింది. అయినా నరే పట్టుదలతో పరీక్ష పూర్తిచేశాను. ఫలితాలు ఎప్పుడొస్తాయా అని వేయి కళ్ళతో ఎదురుచూశాను. నా కష్టానికి ఫలితం దక్కింది. నేను పరీక్షలో విజయం సాధించడమే కాక, ఇంటర్వ్యూలో కూడా సెలెక్టయ్యాను. ఆ రకంగా తన ఆశలు, నా కలలు సాకారం కావడానికి మా అమ్మ ఎంతో పాటుపడింది. ఆమె రుణం తీర్చలేనిది.

– ఎం. సునీత,
హనుమకొండ, వరంగల్ జిల్లా